కొత్త పాలక వర్గంతో
టౌన్ బ్యాంకు గాడిన పడేనా..?

ది చిత్తూరు టౌన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాలోని మొట్టమొదటి సహకార కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ది చిత్తూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు. ఈ బ్యాంకుకు 118 ఏండ్ల చరిత్ర ఉంది. జిల్లాలో ఓ ప్రత్యేక స్థానం కలిగిన చిత్తూరు టౌన్ బ్యాంకు పాలకుల అవినీతి అక్రమాలు, ఆర్‌బిఐ ఆంక్షలతో నేడు కోలుకోలేని స్థితి చేరింది. ఈ సహకార టౌన్ బ్యాంకులో పనిచేస్తున్న సిబ్బందికి 2005 నుండీ జీతాలు, ఇతర అలవెన్స్‌లు పెంచకపోవడంతో నెలకు రూ.12, రూ.15 వేలకే పనిచేయాల్సిన దుస్థితి.

బ్యాంకు డిపాజిట్‌దారులు బ్యాంకులో డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగీ తీసుకోవడానికి ఇబ్బందిపడాల్సి వస్తోంది. 1907 కో ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ 1904 క్రింద ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 59వ బ్యాంకుగా రిజిస్ట్రర్ అయ్యింది. 1907 నుండీ వ్యాపార లావాదేవీలు ప్రారంభించింది. 82 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన చిత్తూరు టౌన్ బ్యాంకు 1917లో టౌన్‌బ్యాంకు లిమిటెడ్, 1980లో రిజర్వు బ్యాంకు నుండీ అర్బన్ కొ అపరేటివ్ లైసెన్సు పొందింది. 2004లో బ్యాంకు ఒడిదుడుకులకులొనై రిజర్వార్ బ్యాంకు ఆంక్షలకు గురైంది. 2004లో రూ. 22.32 కోట్లు నష్టాల్లోకి వెళ్ళింది. 2019లో నష్టాల నుండీ గట్టెక్కి రూ.145.58 లక్షల నికర లాభం సాధించింది. ప్రస్తుతం షెర్‌క్యాపిటల్ రూ.323.84 లక్షలు, డిపాజిట్లు 1403.31లక్షలు, బ్యాంకులో నగదు 136.06లక్షలు, పెట్టుబడులు 1460.19 లక్షలు, స్థిరాస్తులు 91.64 లక్షలుగా ఉంది. 2004లో బ్యాంకు లావాదేవీలపై రిజర్వర్ బ్యాంకు ఆంక్షలతో నష్టాలోకి వెళ్లిన బ్యాంకు 2010లో రిజర్వార్ బ్యాంకు ఆంక్షలు ఎత్తివేశారు.

ప్రస్తుతం ది చిత్తూరు టౌన్‌బ్యాంకు లిమిటెడ్‌లో డిపాజిట్ షెర్ హోల్డర్స్ లక్షా 21 వేల మంది ఉన్నారు. ఫిక్సెడ్ డిపాజిట్లు రూ.1,60,72,000లుగా ఉంది. డిపాజిట్లలపై వడ్డీలు రూ.74,85,680లుగా ఉంది. సిబ్బంది జీతభత్యాలు రూ.33,46,273 చెల్లిస్తున్నారు. ప్రధాన కార్యాలయం చిత్తూరు పట్టణ కేంద్రంలోని చర్చివీధి నుండీ బ్యాంకు లావాదేవీలు నడస్తున్నాయి. సహకర షుగర్‌ఫ్యాక్టరీ దొడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన బ్యాంచ్ 10 సంవత్సరాల క్రితం మూతపడింది. దర్గా, గిరిమ్స్‌పేట బ్యాంచ్‌లు నడస్తున్నాయి.

కొత్త పాలకవర్గంతో పురోగతి సాధించేనా....

గతంలో తెలుగుదేశం పాలకవర్గంలో టౌన్‌బ్యాంకులో గోల్డ్ లావాదేవీల్లో నాటి టౌన్‌బ్యాంకు చైర్మెన్ కోటిరూపాయలకు పైగా అక్రమాలకు పాల్పడం, టౌన్‌బ్యాంకు దొల్లతనాన్ని బయటపెట్టింది. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తోంది. ప్రస్తుతం చైర్మెన్ కాంద్ర రమేష్ నాయుడు టౌన్‌బ్యాంకు చైర్మెన్‌గా బాధ్యతలు స్వీరించారు. డైరెక్టర్లుగా సురేష్‌బాబు, అన్సర్, నరసింహులు వ్యవహరిస్తున్నారు. కొత్తపాలక వర్గం ఇటీవల బాధ్యతలు స్వీకరించింది. ప్రస్తుతం ఇన్‌ఛార్జీ సీఈవోగా సుమతి వ్యవహరిస్తున్నారు. కొత్త పాలక వర్గం సుదీర్ఘ చరిత్ర కలిగిన ది చిత్తూరు కొ అపరేటివ్ టైన్‌బ్యాంకు లిమిటెడ్‌ను లాభాల్లో నడిపించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయడంతో పాటు బ్యాంకు డిపాజిట్‌దార్ల కష్టాలు తీరుస్తారని టౌన్‌బ్యాంకు ఖాతాదారులు కొరుకుంటున్నారు.


చిత్తూరు టౌన్‌బ్యాంకు తొలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మెన్ కాంద్ర రమేష్ నాయుడు

వైభవంగా శ్రీవారి గరుడసేవ

- వర్షాన్ని లెక్క చేయని భక్తజనసంద్రం
- భక్తులతో కిక్కిరిసిన తిరుమల గిరులు


భక్తులతో నిండిన గ్యాలరీలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన ఆదివారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు తనకు ఎంతో ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై లక్ష్మీకాసుల మాల ధరించి భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6 గంటల పైన గరుడసేవ ప్రారంభమైంది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీమలయప్ప స్వామిని గరుడునిపై తిలకించి భక్తిపారవస్యంలో పులకించారు. అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించుకున్నారు.

శ్రీనివాసుని సాలకట్ల బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తిరుమలకు తరలివచ్చారు. ఐదవ రోజు గరుడ వాహనం స్వామివారు భక్తుల దర్శనమిచ్చారు. దీంతో మాడవీధుల్లోని గ్యాలరీలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. గరుడ సేవను కనులారా వీక్షించి తరించేందుకు భక్తులు భారీగా తిరుమలకు తరలివచ్చారు. సాయంత్రం 6.08 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. తిరుమల మొత్తం కూడా జనసంద్రంగా మారిపోయింది. మాడవీధుల్లోని గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. వెలుపల ఉన్న భక్తులు కూడా గ్యాలరీల్లోకి వెళ్లాలని ప్రయత్నించిన. అప్పటికే గ్యాలరీలలో దాదాపుగా 2లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. బయట మరో 70వేల మంది భక్తులు వేచి ఉన్నారు. మొత్తంగా 3లక్షల మంది భక్తులు తిరుమలకు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. వీరందరికీ గరుడ సేవ దర్శనం కల్పించడానికి టీటీడీ ఏర్పాట్లు చేసింది. నాలుగు కార్నర్లలో క్యూలైన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా భక్తులను లోపలికి పంపేందుకు చర్యలు చేపట్టారు. మాడవీధులు, ఔటర్ రింగ్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ అన్నీ భక్తులతో నిండిపోయాయి. గ్యాలరీల్లోకి వెళ్లేందుకు భక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడం లేదు. గరుడ సేవ రోజు స్వామి వారిని దర్శించుకుంటే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే, బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తారు. అటు పోలీసులను భారీగా మోహరించారు. దాదాపుగా 5వేల మంది పోలీసులు విధుల్లో ఉన్నారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన గరుడ సేవ అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. అప్పటివరకు భక్తులందరికీ గరుడ సేవ దర్శనం లభిస్తుంది. శ్రీవారి ఆలయం ముందు దర్శనం పూర్తవుతుంది. 4వేల వాహనాలతో తిరుమల పార్కింగ్ ప్రాంతాలు పూర్తిగా నిండిపోయాయి. దీంతో ప్రైవేట్ వాహనాలను కొండపైకి అనుమతించడం లేదు. అలిపిరి వద్దే ఆపేస్తున్నారు. ఆర్టీసీ బస్సులను మాత్రమే పోలీసులు కొండపైకి అనుమతిస్తున్నారు.

గరుడ వాహనం- సర్వపాప ప్రాయశ్చిత్తం

పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. ఈవాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళి కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వర్షంలోనూ గొడులకు పట్టుకుని..

ఈవో ఆదేశాలు భేకతర్- జేఈవో నిర్లక్ష్యం

వర్షంలో తడుస్తూనే గరుడసేవలో భక్తులు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వానలో భక్తులు తడిసిముద్దయ్యారు. ఈవో గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులు గ్యాలరీలో తడవకుండా ఉండేందుకు ఈవో మంచి నిర్ణయం తీసుకున్నారు. దాదాపు కోటి రూపాయల రైన్ జర్కిన్‌లు భక్తులకు అందజేయాలని జేఈఓను ఆదేశించారు. అయితే రైన్ జర్కిన్‌లు తెప్పించకపోవడంతో భక్తులు వానలో తడుస్తూనే గడువసేవను తిలకించారు. దీంతో ఈవో జేఈవోను ప్రశ్నించగా తనకు సాధ్యపడలేదని చెప్పడంతో ఈవో ఆగ్రహించారు. గత అనుభవాలతో భక్తులు ఇబ్బందులు గ్రహించి లక్ష పదివేల రైన్ జర్కిన్‌లు తెప్పిస్తే భక్తులు వానకు తడుస్తున్నారని, మీరు ఏమి చేస్తున్నారని ఆగ్రహించారు. పలు మార్లు వర్షం రావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నిర్లక్ష్యంపై వివరణ కోరినట్టు సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 29వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 29వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చుని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ సెల్

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 29వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 29వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

ఊరెళ్తుతున్నారా.. జర భద్రం

ప్రజాశక్తి- పూతలపట్టు

వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం పట్టణాలాల్లో, మండల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు దసరా సెలవులు రావడంతో ఊర్లు, విహారయాత్రలకు వెళుతుంటారు. ఇలాంటి సమయాల్లో ఇళ్ల వద్ద చోరీలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన ఇల్లు మన జాగ్రత్త అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి. చోరీలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలి. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలి. ఊరెళు తున్నప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్లలో తెలియజేయాలి. లేకుంటే ఇల్లు గుల్లయ్యే ప్రమాదం ఉందని తెలుసుకోవాలి.

పూతలపట్టులో మరింత జాగ్రత్త..

ఇటీవల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగానే రెండు గృహాల్లో చోరీలు జరిగాయి. ఇది అంతర రాష్ట్ర దుండగుల పనేనంటూ పోలీసులు తేల్చారు. ఇందుకు అనుగుణంగానే చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాల చోరీలు అధికంగా సంభవిస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో ఉన్న వాహనాలు సైతం కనుమరుగవుతున్నాయి. గతంలో కూడా దుకాణాల్లో చోరీలు జరిగిన సంఘటనలు కోకొల్లలు.

ప్రజలు అనుసరించాల్సిన పద్ధతులు..

ఇళ్లలో ఉన్న బంగారం, వెండి, ఆభరణాలు, నగదు విలువైన వస్తువులు బ్యాంకు లాకర్లలో లేదా బంధువుల గృహాల్లో భద్రపరచుకోవాలి. ఇళ్ల ప్రధాన ద్వారాలకు సెంట్రల్ లాక్ సిస్టంతో పాటు సెక్యూరిటీ అలారం సెన్సార్లు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో పలుచోట్ల నిఘా నేత్రాలు (సిసి కెమెరాలు) ఏర్పాటు చేసుకొని ఫోన్‌లలో ఎప్పటికప్పుడు పరివేక్షిస్తుండాలి. కుటుంబ సభ్యులతో కలిసి ఎన్ని రోజులు ఊరెళు తున్నారనేది సంబంధిత పోలీస్ స్టేషన్లలో సమాచారం అందజేయాలి. అలాంటప్పుడు పెట్రోలింగ్ సమయంలో పోలీసులు ఆ ఇళ్లపై ఎక్కువగా నిఘా పెట్టే అవకాశం ఉంది. స్థానికులకు అనుమానిత వ్యక్తులు, కొత్తవారు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలి. ఊరెళ్లే విషయాలతో పాటు ఇతర వ్యక్తిగత సమాచారం సామాజిక మధ్యమాలో పోస్ట్ చేయరాదు.

నిఘా పెంచుతాం... సీఐ, కృష్ణమోహన్

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పండుగ సమయాల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊరెల్లేవారు ఇరుగుపొరుగు ఉన్నవారిని కాస్త నిఘా పట్టాలని కోరడంతో పాటు ఈ సమాచారం స్థానిక పోలీస్‌స్టేషన్లకు అందజేస్తే ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచుతాం. రాత్రి వేళల్లో బీట్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తాం. ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారాసపడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ప్రజలు ఈ మేరకు పోలీసులకు సహకరిస్తే చోరీలు పూర్తిస్థాయిలో నివారించవచ్చు.

సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు ఆదివారం ఎల్‌జిబి టవర్స్ ఫంక్షన్ హాల్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కన్వీనర్ కె.వి రమణ, నరసింహారెడ్డి, శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు సురేష్ బాబుతోపాటు నలుగురు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ పాత కమిటీని రద్దు పరచి కొత్త కమిటీని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవడం జరిగింది. మాజీ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ పి.షణ్ముగం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అధ్యక్షులుగా పిఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు సిద్దు, కార్యదర్శి మల్లేశ్వరి, జాయింట్ సెక్రెటరీ రుతిక్, కోశాధికారి జి.దేవానంద్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, కుసుమలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షణ్ముగం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌ను తన కుమార్తె స్వర్గీయ దుర్గ జ్ఞాపకార్థం శ్రీదుర్గా చారిటబుల్ ట్రస్ట్ దత్తతకు తీసుకొని సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు కావలసిన వనరులు, కోచింగ్, ఇతరత్రా కార్యక్రమాలు ట్రస్టు ద్వారా ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని తెలిపారు.

అధినేత నమ్మకాన్ని వమ్ము చేయొద్దు: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం: టిడిపి అధినేత, సీఎం చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అధ్యక్షులు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపల్ పార్టీ అధ్యక్షులను ఇటీవల నూతనంగా పార్టీ అధినేత ప్రకటించారు. దీంతో ఆదివారం కుప్పం టిడిపి కార్యాలయంలో మండల పార్టీ నూతన అధ్యక్షులను ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఘనంగా సత్కరించారు. పార్టీ క్యాడర్‌కు అన్ని విధాలుగా అందుబాటులో ఉండడంతో పాటు ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి పరిష్కరించే విధంగా అధ్యక్షులు బాధ్యత వహించాలన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, నాలుగు మండలాల అధ్యక్షులు రాజగోపాల్, ఉదయ్ కుమార్, సుబ్బు, వెంకటరమణ, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ పాల్గొన్నారు.

కూలీలను ఇబ్బంది పెడుతున్న కొత్త టెక్నాలజీ

- ఉపాధిలోనూ ఈ కేవైసీ తప్పనిసరి..
- జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు
- 1 నుండి నూతన విధానం అమలులోకి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని చిత్తూరు, నెల్లూరు జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకువస్తోంది. ఇకపై కూలీలందరికీ ఈకేవైసీ చేసుకోవాల్సిందేనని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం. ఇదిలా ఉండగా పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలు కల్పించడంలో, సకాలంలో బిల్లులు చెల్లించండంలోనూ అలసత్వం వహిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతికి చెక్ అంటూ కూలీలకు ఈకేవైసి తప్పనిసరి అంటూ ఇబ్బందులకు గురిచేస్తోంది. జిల్లాలో చాలాచోట్ల ఉపాధి పనులు యంత్రాలతో చేయిస్తున్నారు, సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించడం లేదు, రాజకీయ జోక్యం పెరిగి కూలీలకు సరిగా పని కూడా కల్పించని పరిస్థితులున్నాయి.. ఇవన్నీ పట్టించుకోకుండా కేవలం కూలీల హాజరుపై శ్రద్ధ చూపుతున్నాం, ఇకపై కూలీల హాజరులో అవకతవకలు జరగవని చెప్పుకోవడం గమనార్హం.

చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 700 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు సుమారు 3,78,993 లక్షల మంది ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు 1,77,275 మందికి దాదాపు జిల్లాలో 50శాతం పైగా ఈకేవైసీ పూర్తి చేశారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డుతో ఈ కేవైసీ ఈనెల 30వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలని అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరు జిల్లా ఈ కేవైసీ ప్రక్రియ అమలు వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ఈనెల 30 తేదీలోపు జిల్లాలో 100శాతం ఉపాధి కూలీలకు ఈ కేవైసీ పూర్తి చేసే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు ఈ కేవైసీ చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని, ఈ కేవైసీ పూర్తి చేసుకున్న వారికే అక్టోబర్ 1 నుంచి పని కల్పించాలని, వారికే కూలీ డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ విధానం వలన అవినీతికి చెక్‌పడుతుందో లేదో కానీ గ్రామాల్లోని ఉపాధి కూలీలకు మాత్రం పనుల కల్పనలో అన్యాయం జరగుతుంది. వీరు తీసుకొచ్చిన విధానం వలన ఆధార్ కార్డుకు ఈకేవైసి అయి ఉంటేనే వారికి పని ఇస్తారు, కూలీ దక్కుతుంది. లేకుంటే ఉపాధి పైన ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మందికి పని లేక కూలీ లేక మరో పని వెతుకోవాల్సిందే.

గ్రామీణ ప్రాంతాల్లో కొందరు అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మకై నకిరీ హాజరు వేయడం, యంత్రాలతో పనిచేయిస్తూ కూలీల పేర్లపై బిల్లులు చేయడం వంటి అవినీతికి అడ్డుకట్ట వేయాలి. అలా కాకుండా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాణ ప్రాంతాల్లో ఉపాధి కార్డులున్న వారి వద్దకు వెళ్లి వారి ఫోటో తీసి జాబ్‌కార్డును, ఈకేవైసితో ఆధార్‌ను లింక్ చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. పనిప్రదేశాల్లో మొదట ఉపాధి కూలి ఫోటోని తీసి అప్‌లోడ్ చేస్తారు, నాలుగు గంటల తర్వాత మరోసారి వారి ఫోటో తీసి అప్లోడ్ చేస్తారు, ఒకే వ్యక్తి రెండు ఫోటోలలో ఉంటేనే కూలీ డబ్బులు ఇస్తారు లేదంటే డబ్బులను నిలిపివేస్తారు ఈ విధానంపై సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇది పూర్తిగా అమలులోకి వస్తే నకిలీ హాజరుకు అవకాశం ఉండదని, అలానే వేతనాల చెల్లింపుల్లో న్యాయం జరుగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేయించుకోవాలి

ఆవాసాని రవికుమార్, ఉపాధి హామీ పీడీ

ఉపాధి శ్రామికులకు ఆధార్ లింక్డ్ ఎన్‌ఎంఎంఎస్ యాప్‌కు అనుసంధానం చేసి ఈకేవైసీ చేస్తున్నాం. జాబ్ కార్డ్ కలిగిన రైతులు ఉపాధి హామీలో వ్యక్తిగత పనులైన హార్టికల్చర్, హౌసింగ్గో, కులం షెడ్లు, సంబంధించి పనులు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలి. ఈనెల 30వ తేదీ లోపు జిల్లా వ్యాప్తంగా 100శాతం ఈ కేవైసీ పూర్తి చేస్తాం. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. నిజమైన ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందుతుంది.

కొత్త టెక్నాలజీతో కూలీలను ఇబ్బంది పెట్టొద్దు

- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని చిత్తూరు జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నప్పటికీ జిల్లాలో ఆ మేరకు కృషి జరగడం లేదు. జాబు కార్డులున్న వారందరికీ పని కల్పించడంలో లోపం ఉంది. అందరికీ పని కల్పించి సకాలంలో వేతనాలు ఇస్తే కూలీలు పనిచేయడానికి ముందుకు వస్తారు. గతంలో ఉపాధి హామీ చట్టంలో ఉన్న సౌకర్యాలు కూలీలకు అందించకుండా ఎన్ని రకాల పద్ధతుల అవలంభించినా పనిలో లోపాలు వస్తూనే ఉంటాయి. రాజకీయ జోక్యం మానుకొని చిత్తశుద్ధితో కూలీలకు పనికల్పించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. కొందరు కూలీలకు బదులుగా యంత్రాలతో పనిచేస్తున్న అధికారులు మీనవేషాలు లెక్కించడం అనుమానాలకు దారితీస్తుంది. జిల్లా కలెక్టర్, పీడీ చొరవ తీసుకుని క్షేత్రస్థాయిలో అవకతవకులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీఎస్టీ ఛాంపియన్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : జిల్లాలో జీఎస్టీ ఛాంపియన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ అమలులో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఎస్‌జి వెబ్‌సైట్‌లో వెంటనే లాగిన్ అవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్‌ను జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్‌గా రిజిస్టర్ చేయడం జరుగుతుంది. అనంతరం జేసి జిల్లాస్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. మండల స్థాయి జీఎస్టీ కో ఆర్డినేటర్లు తమ పరిధిలోని గ్రామ వార్డు సచివాలయ స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్లను నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా వెబ్సైట్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మొబైల్ యాప్ యాక్టివేషన్ జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి మొబైల్ యాప్ లింక్ ద్వారా ఈవెంట్స్ షెడ్యూలింగ్, డాక్యుమెంటేషన్ (ఫోటోలు, రిపోర్ట్స్ అప్‌లోడ్) చేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయస్థాయి వరకు రిజిస్ట్రేషన్ అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందని, వెంటనే చర్యలు తీసుకుని త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాన్నారు.

శ్రీవారి గొడుగులకు పూజలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : చెన్నై హిందూ మహాసభ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారికి సమర్పించే వాహనసేవ గొడుగులు, పాదుకలకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం హిందూ మహాసభ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొడుగులు, పాదుకలు శ్రీపురం నారాయణి అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి తిరుమలకు చేర్చుతారు. ఈక్రమంలో ఆదివారం చిత్తూరు నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఇంటి తేవడంతో ఆయన, తండ్రి గురజాల చెన్నకేశవుల నాయుడుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడవి బిడ్డల కష్టానికి ప్రతిఫలం లభించేనా?

- 23 ఏళ్ల క్రితం పండ్ల మొక్కలు పెంపకం
- ప్రస్తుతం దట్టంగా పెరిగిన చెట్లు
- ఆదాయం వచ్చి ఆదుకుంటుందని నిరీక్షణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల పరిసరాలలో అడవికి సంబంధించిన 35 ఎకరాలలో 27 ఏళ్ల క్రితం అడవి బిడ్డలు వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు.. ప్రస్తుతం అవి తమకు ప్రతిఫలం ఇచ్చి తమకు ఆదాయం వచ్చి ఆదుకుంటుందని వారు ఎదురుచూస్తున్నారు.

23 ఏళ్ల క్రితం పండ్ల మొక్కలు నాటారు..

మండలంలోని కొలమాసన పల్లికి చెందిన రత్నమ్మ ఆయుర్వేద నర్సరీని స్థాపించి మూలికలను సేకరించి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే 2002లో ధర్మపురికి చెందిన 15 మంది అడవి పుత్రుల చేతులు మీదుగా ఒకటిన్నర సంవత్సరం కష్టించి వివిధ రకాల చెట్లు నాటించారు. 35 ఎకరాల అడవికి సంబంధించిన భూమిలో సీతాఫలం, చింత, నేరేడు, ఉసిరి, వెదురు, ఎర్రచందనం వంటి చెట్లను తిరుపతి కుక్కలదొడ్డి నుండి తెచ్చి వాచర్ సుబ్బయ్య సమక్షంలో అప్పటి ఎఫ్ఆర్ఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాటారు. కష్టపడిన వారు ఒక గ్రూపుగా ఏర్పడి ఈ ఫలసాయాన్ని పొందవచ్చని అప్పటి అధికారులు అప్పట్లో సలహాలు ఇచ్చారు.

మొక్కలు లాభం ఇచ్చేనా?

ఈ చెట్ల పెంపకం గురించి ధర్మపురికి చెందిన ఈ రామమూర్తిని మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ కాన్హా నేషనల్ పార్కుకు ట్రెనింగ్ నిమిత్తం అప్పట్లో 22 రోజులపాటు పంపించి అక్కడ తర్ఫీదు ఇచ్చారు. అనంతరం ఈ మొక్కలు నాటడంలో కష్టపడిన అడవి పుత్రులు ఇప్పుడు ఎటువంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో నాటిన చెట్లు ఇప్పుడు ఫలాలను అందిస్తున్నాయి. కష్టపడిన వారిని గుర్తించి ఆ ఫల సాయం తమకు అందించేందుకు అటవీ శాఖాధికారులు సహకరించాలని కోరారు.

అటవీ అధికారులు సాయం చేయాలి

ఈ చెట్ల నాటి 23 ఏళ్లు అయ్యాయి. అప్పట్లో నాటిన పలు రకాల వృక్షాలు వున్న సంగతి అటవీశాఖ సిబ్బందికి కూడా తెలియడం లేదు. 23 సంవత్సరాలు సుదీర్ఘ కాలం గడవడంతో ఇక్కడ నాటిన చెట్ల గురించి అటవీ శాఖ సిబ్బందికి కూడా తెలియడం లేదని సమాచారం. పిచ్చి గుండ్లపల్లి, కమ్మనపల్లి, సాకే ఊరు, మరిమానుచేన్లు వంటి గ్రామాలకు ఆనుకొని ఉన్న అడవిలో ఎర్రచందనం చెట్లను కూడా నాటారు. ఇప్పుడు అవి ఏపుగా పెరిగాయి. వీటి రక్షణను పరిశీలించడానికి అటు వైపు అటవీ సిబ్బంది కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. వెదురు పొదలు కూడా ఏపుగా వ్యాపించాయని, ఇప్పటికైనా సంబంధిత ఫారెస్ట్ అధికారులు 35 ఎకరాలలో చెట్లను నాటి కష్టపడిన వారి శ్రమకు ఫలితాన్ని అందించి ఈ అడవిలో వున్న వంద ఎకరాల విలువైన చెట్లను కాపాడి, చెట్లను నాటిన వారిని గుర్తించి, పంటను ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని, కష్టపడి చెట్లు నాటిన పేదలకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అటవీ ప్రాంతాల వారు నాటిన పండ్ల చెట్లు

మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బాబునాయుడు

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి

వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టిఎం బాబునాయుడు

ప్రజాశక్తి-గుడిపల్లి:

అక్టోబరు 7వ తేదీ నిర్వహించనున్న వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టిఎం బాబునాయుడు కోరారు. నియోజక వర్గ వాల్మీకి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాల్మీకి కార్పొ రేషన్ డైరెక్టర్ టిఎం బాబు నాయుడు మాట్లాడుతూ అక్టోబరు 7వ తేదీ వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని అందరి సలహాలు, సూచనలు తీసుకుని జయప్రదం చేయడానికి ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వాల్మీకి సంఘం నాయకులు సురేష్, మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, ఎస్ఆర్ చంద్ర పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన సురేష్ బాబు

సీఎంకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న సురేష్‌బాబు

ప్రజాశక్తి-కుప్పం:

అమరావతిలో సీఎం చంద్రబాబును పిఎంకె ఉడా చైర్మన్ డాక్టరు సురేష్ బాబు కలిశారు. పిఎంకె ఉడా చైర్మన్‌గా తనను నియమించడంపై సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ త్వరలో ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చి తనను ఆశీర్వదించాలని ముఖ్యమంత్రిని కోరారు. పలువు రు మంత్రులతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లను సురేష్ బాబు కలిసి ప్రమాణ స్వీకారోత్సవ ఆహ్వాన పత్రికలు అందించారు.

నవనీతమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నవనీతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

వెదురుకుప్పం మండలం లోని బండి నవనీతమ్మ మృత దేహానికి పూల మాలలు వేసి నివా ళులర్పిస్తున్న రాష్ట్ర వైసిపి అడ్వైజ ర్ కమిటీ సభ్యులు, మాజీ డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి ఆదివారం కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మృతురాలు భారత్ గ్యాస్ డీలర్ ఉమాపతి తల్లి.. ఆమె మరో కుమారుడు సభాపతి జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. మరో ఇద్దరు సంతానం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి నేత బండి గోవర్ధన్ రెడ్డి, జిల్లా వైసీపీ నేత బట్టే సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ వైసిపి వైద్య విభాగం అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, ప్రభాకర్ కోఆప్షన్ సభ్యులు వెంకటేష్, మండల యూత్ అధ్యక్షులు బోడి రెడ్డి నరేష్ రెడ్డి, జగదీశ్ రెడ్డి,నాయకులు చిరంజీవి రెడ్డి, రమేష్ రెడ్డి, పురంధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కోండారెడ్డి, పెద్దిరెడ్డి, దేవరాజులు రెడ్డి , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -యాదమరి:

మండల సర్వసభ్య సమావేశం యాదమరి మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి పెంచల వీరేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి యాదగిరి మండల సర్పంచులు, ఎంపీటీసీ, మండల స్థాయి అధికారులు, హాజరు కావాలన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి పనుల పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు సహకార సంఘ మహాజనసభ

ప్రజాశక్తి - యాదమరి:

చిత్రానాయుడు

యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మహాజన సభ నిర్వహిస్తున్నట్లు యాదమరి సింగిల్ విండో చైర్ పర్సన్ చిత్రానాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు యాదమరి సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో సహకార సంఘం సభ్యులు ప్రతి ఒక్కరూ సమావేశాన్ని హాజరుకావాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం జమా ఖర్చుల వివరాలు , పంట రుణాలు, హౌస్ మార్టిగేజ్ రుణాలు, రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందించడం పై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి సహకార సంఘ సభ్యులు ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు.

సుబ్రమణిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి మండల అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండల అధ్యక్షునిగా ఎన్నికైన సుబ్రమణిని సింగి ల్ విండో చైర్మన్, వారి బృందం సభ్యు లు ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

తగ్గిన జీఎస్‌టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తగ్గిన జిఎస్‌టిని వివరించాలి

జిల్లా అధికారి జితేంద్రబాబు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్‌టీ ని వినియోగదారులకు వివరించాలని జిల్లా అధికారి జితేంద్రబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నిత్యావసర సరుకుల విక్రయించే దుకాణాలకు తగ్గించిన జీఎస్‌టీని కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో తగ్గిన జిఎస్‌టి కరపత్రాలను పంపిణీ చేసి తగ్గిన జిఎస్టి ప్రకారం నిత్యావసర సరుకులను విక్రయించాలని వినియోగదారులకు మేలు చేకూరేలా చూడాల్సిన బాధ్యత దుకాణ యాజమాన్యం పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సేల్ టాక్స్ ఆఫీసర్ వివేక్, కిరాణా కొట్టు యాజమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ విజయవాడ నుంచి కుప్పంకి వెళ్లడానికి బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో ఆదివారం దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే థామస్‌కు టీడీపీ నేతలు పలువురు పుష్పగుచ్చాలు అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, పార్లమెంట్ ఐటిడిపి ఉపాధ్యక్షుడు మహేష్ నాయుడు, నేతలు తాళూరు శివ నాయుడు, రావిళ్ల చిట్టిబాబు, రూపేష్ కుమార్, రుషేంద్రబాబు, ప్రభాకర్ నాయుడు, గోళ్ళ ప్రసన్న కుమార్, యశ్వంత్ , విక్రమ్ , బాలాజీ యాదవ్‌లు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం : చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం, ఇనాం కొత్తూరులో వెలసిన మూలస్థాన అమ్మవారిని విశ్రాంతి ఉద్యోగి నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. దేవీ నవరాత్రులు సందర్భంగా ఆ గ్రామస్తులు ఉభయులుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ పెద్దలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదానం చేశారు. ఆయన కుమారుడు గోపీ ఎల్ఐసి కంపెనీలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారని ఆదివారం మీడియాకు తెలిపారు.

లక్ష్మీదేవిగా అల్లియల్లమ్మ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన అల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆరవరోజు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జంగాలపల్లి గ్రామానికి చెందిన కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. గంగాధర నెల్లూరు ఎగవూరుకు చెందిన వేణు కుమారుడు మధు మహేష్ (పంబల్) సభ్యులు దాదాపు 500 మందికి అన్నదానం నిర్వహించారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని గ్రామదేవత ముత్యాలమ్మ సరస్వతి దేవి అలంకారంతో ఆదివారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయదారులుగా బంగారు పాల్యం కరణం సంక్షేమ సంఘం సభ్యులు వ్యవహరించారు. నంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణమూర్తి, సంఘ ప్రధాన కార్యదర్శి రవీంద్ర ప్రసాద్ , శంకరన్, అర్చకులు మురళి గురుకుల్ పాల్గొన్నారు.

రామకుప్పం: శరవన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలోని వాసవి ఆలయంలో మహాలక్ష్మి అవతారం, ఆనిగనూరులో వెండి కవచం, అలంకారంతో, కంభలా దేవుల పల్లిలోని చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆదివారం సాయంత్రం పంచామృత అభిషేకాలు, దీపారాధన వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి దర్శన ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

గంగాధర నెల్లూరు: వేపంజేరి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ వార్షిక నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లు శేష ,సింహ వాహనాలపై ఆదివారం విహరించారు. ఆలయ ట్రస్టు కేఎస్ వాసు, అమృతవల్లి దంపతులు ధ్వజస్తంభం వద్దకు పూజా సామగ్రితో రాగా ధ్వజారోహణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు శేష వాహనంపై స్వామి అమ్మవార్లు, రాత్రి సింహ వాహనంపై ఊరేగారు. భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ట్రస్ట్ సతీమణి సుమిత్ర శ్రీధర్, ఆలయ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేటి తరానికి జాషువాను పరిచయం చేయాలి

- తులసినాథం నాయుడు

ప్రజాశక్తి పలమనేరు రూరల్ (గంగవరం): గుర్రం జాషువా సాహిత్యాన్ని నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి తులసినాథం నాయుడు అన్నారు. కళా మందిరంలో గుర్రం జాషువా 130వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజు కంటే కవి గొప్పవాడని చాటిన ధీశాలి కవి కోకిల గుర్రం జాషువా అన్నారు. విశ్వనరుడిగా, నవయుగ కవి చక్రవర్తిగా కీర్తి గడించిన జాషువాను భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించిందన్నారు. చీత్కారాలు పొందిన చోటే సత్కారాలు పొందే స్థాయికి ఎదగాలన్న స్ఫూర్తిని నేటి యువత జాషువా జీవితం నుండి పొందా లన్నారు. ఆయన రచనలు గబ్బిలం, ఫిరదౌసి, నేతాజీ, బాపూజీ, శిశువు, క్రీస్తు చరిత్ర, నాకథ, తెలుగు తల్లి, భీష్ముడు, ముంతాజ్ మహల్, కాందిశీకుడు మొదలైనవి బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. ముఖ్యఅతిథి గంగవరం ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు భాషకు, సాహిత్యానికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పుష్ప లు చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరం నాయుడు, చంద్రశేఖరయ్య, కుమారి, భార్గవి, సాహిత్య, రూప, జమున, మహావిష్ణు, సంస్థ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.

జాషువాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

దసరా క్రికెట్ ప్రారంభం

ప్రజాశక్తి -విజయపురం (నగరి):

స్థానిక కేవీకే మైదానంలో దసరా 2025 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభ మయ్యా యి. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ డీవైఈవో, లయన్స్ క్లబ్ డిస్టిక్ చైర్‌పర్సన్ ప్రభాకర్‌రాజు ఈ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసి క ఉల్లాసంతో పాటు మేధోశక్తిని పెంచు తాయన్నా రు. శరీర ధృఢత్వాన్ని ఆరోగ్యాన్ని ఇస్తుం దన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉన్నత విద్యావ కాశాలతో పాటు, ఉద్యోగ సాధనలోను ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కేవీకే ఇన్‌ఛార్జి బాబు మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించే ఈ పోటీల్లో అండర్ 11 విభాగంలో 5 టీంలు పాల్గొంటున్నాయని వారికి నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఉంటాయన్నారు. అండర్ 14 విభాగంలో 4 టీంలు పాల్గొంటున్నాయని వారికి మూడు లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. దసరా సెలవుల్లో విద్యార్థుల్లో క్రీడలపై ఆశక్తి పెంచడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు అందరూ పాల్గొనగా ట్రోఫీలను ప్రదర్శనగా ఉంచి క్రీడావందనం చేసిన అనంతరం పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మోహన్, శీనురాజ్, కంచి క్రికెట్ అకాడమి కోచ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

దసరా క్రికెట్ పోటీలో పాల్గొన్న జట్లు

పక్కా గృహాలు మంజూరు చేయాలి

ప్రత్యేక ప్రతిభావంతుల సంఘం డిమాండు

ప్రజాశక్తి-కుప్పం: ప్రత్యేక ప్రతిభా వంతులకు మండల కేంద్రాల్లో ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కుప్పం నియోజకవర్గ ప్రత్యేక ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు నారాయణప్ప ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కుప్పం రాజావారి పార్కులో ప్రత్యేక ప్రతి భావంతుల సమావేశం ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని ప్రత్యేక ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. మండల కేంద్రా ల్లో ప్రత్యేక ప్రతిభావం తులకు ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, వారికి కమ్యూనిటీ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని వారు డిమాండు చేశారు. అర్హులైన వారికి మూడు చక్రాల వాహనాలతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

మాట్లాడుతున్న ప్రత్యేక ప్రతిభా వంతుల సంఘం అధ్యక్షులు నారాయణప్ప

ఐవిఎస్ వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కుప్పం: పిల్లలు లేని తల్లిదండ్రులు ఐవీఎస్ ద్వారా వైద్యం చేయించుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తారని జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం ప్రియా నర్సింగ్ హోమ్ లో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఎమ్మెల్యే డాక్టరు థామస్ ప్రారంభించారు. సమాజంలో బిడ్డలు లేని తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు ప్రతి ఒక్కరికి తెలుసని జనాభా పెరుగుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతమంది బిడ్డలు ఉంటే అంత మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని చెప్పారని ఇందులో భాగంగా ఐవీఎస్ వైద్యం చేయించుకునే తల్లిదండ్రులకు సీఎంఆర్ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియా నర్సింగ్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టిడిపి మున్సిపల్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, అడ్వైజర్ కమిటీ సభ్యుడు రామచంద్ర, నాను పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రూ.8 లక్షల నోట్లతో అమ్మవారి అలంకారం

ప్రజాశక్తి-కుప్పం:

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుప్పం పాతపేట శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో రూ. 8 లక్షలతో అమ్మవారికి అలంకరణ చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా జరుగుతుంది. ఉత్సవంలో భాగంగా ఏడవ రోజు చండి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 8 లక్షలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించినట్లు వాసవి సేవా సంఘం అధ్యక్షుడు ప్రమోద్ తెలిపారు.

రూ.8 లక్షల నోట్లతో అలంకరించిన దృశ్యం

విద్యారంగం బలోపేతానికి కృషి: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శాంతిపురం: రాష్ట్రంలో విద్యారంగం బలోపేతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్ లు కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్సు మెంటుకు మరో 400 కోట్ల రూపాయలు విడుదల చేసిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం 4 వేల కోట్లు బకాయిలు పెట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే 1200 కోట్ల రూపాయల విడుదల చేసిందన్నారు. ఇప్పుడు మరో నాలుగు వందల కోట్లు విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకు మొత్తం 1600 కోట్ల రూపాయలు విడుదల చేసిందని వివరిం చారు. మెగా డీఎస్సీ మెగా హిట్: కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ మెగా హిట్ అయిందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పాతిశ్రామిక ప్రగతితో ఉద్యోగ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు.

క్రైం న్యూస్

ప్రమాదానికి గురైన కారు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-కుప్పం: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన కుప్పం సరిహద్దులోని తమిళనాడు నాట్రంపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కుప్పంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న రవి తన కుటుంబంతో చెన్నై వెళ్లి కారులో కుప్పంకు తిరుగు పయనమయ్యాడు. అయితే నాట్రంపల్లి సమీపంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎదురుగా వెళుతున్న లారీని కారు వెనుక వైపు నుండి ఢీకొనడంతో రవి కుమారుడు సాత్విక్ (17) అక్కడికక్కడే మృతి చెందగా రవి అతని భార్య ప్రసన్న తీవ్రంగా గాయపడ్డారు. దీంతో క్షతగాత్రులను తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు ఆస్పత్రికి తరలించారు. సాత్విక్ తిరుపతిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మానసిక ఒత్తిడికి గురైన ఓ వ్యక్తి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. చిత్తూరు బాలాజీ నగర్ గ్రీమ్స్‌పేటకు చెందిన దుర్గాప్రసాద్ తన నివాసంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మేరీ లావణ్య కథనం మేరకు..తన భర్త మద్యం అలవాటు పడి కుటుంబాన్ని సరిగా చూసుకోలేదు. దుర్గాప్రసాద్ ఇటీవలి కాలంలో మొబైల్‌లో గేమ్స్ ఆడుతూ మానసిక ఒత్తిడికి గురయ్యేవాడు. మూడు రోజులుగా 'నేను బతకాలనుకోవడం లేదు, చనిపోతాను' అని చెప్పేవాడని ఆదివారం ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో దుర్గాప్రసాద్ ఎవరికి చెప్పకుండా గంగనపల్లిలోని ఇంటి నుండి బైక్‌పై బయలుదేరి, బాలాజీ నగర్, గ్రీమ్స్‌పేట, చిత్తూరు పట్టణంలోని వారి పాత ఇంటికి వెళ్లి, సీలింగ్ ఫ్యాన్‌కు మంచం గుడ్డ కట్టుకొని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వారి బంధువులు, మరి కొందరు వెతుకుతూ అక్కడికి వెళ్లి మృతుడిని కనుగొని వెంటనే చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ పరీక్షించిన డాక్టర్ 'దుర్గాప్రసాద్ అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారని అని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హరికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

హరికృష్ణకు గుర్రం జాషువా పురస్కారం

ప్రజాశక్తి- పెనుమూరు: ప్రముఖ కవి, రచయిత, గేయకారుడు, కళాకారుడు, పాత్రికేయుడు, అభ్యుదయ రైతు అయిన పసపల హరికృష్ణారెడ్డికి గుర్రం జాషువా స్మారక పురస్కారం లభించింది. ఆదివారం చిత్తూరులోని మురకంబట్టు వినాయక దేవాలయ కళా ప్రాంగణంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా జిల్లా బిజెపి నాయకులు, కళా సంస్థలు హరికృష్ణారెడ్డికి గుర్రం జాషువా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఆ పార్టీ నాయకులు చిట్టిబాబు నాయుడు, దుర్గా రామకృష్ణ, విశ్రాంత డీఈవో చిట్టిబాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు భాషా సాహిత్యాలకు హరికృష్ణ చేస్తున్న సేవలను గుర్తించి గుర్రం జాషువా పురస్కారం అందించారు. హరికృష్ణ తెలుగు భాష వ్యాప్తి కోసం,సాహిత్య సంస్కృతి దీప్తి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ తెలుగు రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, గురజాడ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేశారు. అనేక కవితా సంపుటులు, గేయ సంపుటులు ప్రచురించారు. గుర్రం జాషువా పురస్కారం పొందిన హరికృష్ణను పలు కళా సాహితీ భాష సంస్థలు అభినందించాయి.

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

అన్యాయానికి గురైన వారి కోసమే డిజిటల్ బుక్

- క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైసీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజ ల కోసం ఆ పార్టీ అధినేత వై యస్ జగన్ మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ లాంచ్ చేశారని మాజీ మంత్రి ఆర్కేరోజా స్పష్టం చేశారు. తన నివాసం వద్ద వైసీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టే వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని, పార్టీ అధినేత, జగనన్న అండగా ఉంటారని పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. ప్రజాప్రభుత్వం అంటే సంక్షేమం, అభివృద్ధిని పరిగణలోకి తీసుకోవాలి కానీ దురదృష్టవశాత్తు ఏపీలో చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలలుగా అరాచక పాలన సాగుతోందని వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు పెడుతూ అనాగరికంగా వ్యవహరిస్తున్నారన్నారు. సోషల్ మీడియా వారిని వదిలిపెట్టడం లేదని వారిపై కూడా అక్రమ కేసు పెడుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు కోర్టులు అక్షింతలు వేస్తున్నా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. వైయస్ఆర్‌సీపీలో ఇకపై కార్యకర్తలకే పెద్దపీట ఉంటుందని కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా 'డిజిటల్ బుక్'లో నమోదు చేయవచ్చన్నారు. 'డీబీ.డబ్ల్యూఈవైయస్ఆర్‌సీపీ.కామ్" అనే వెబ్‌సైట్‌లో గానీ, 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు జయప్రకాష్, శంకర్, బాలన్, జడ్పీటీసీ పరంధామన్, నాయకులు పాల్గొన్నారు.